**Eenadu**

# ‘ఆరోగ్య’ నియామకాల్లో జాప్యం

- 2,118 పోస్టులకు ఆర్నెల్ల కిందటే ఆర్థిక శాఖ అనుమతి
- భర్తీ నిబంధనల్లో కొరవడిన స్పష్టత

ఈనాడు– హైదరాబాద్: వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న 2,118 పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ ఆర్థిక శాఖ ఆర్నెల్ల కిందటే అనుమతించినా.. నేటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ పోస్టులన్నింటినీ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారానే భర్తీ చేయాలని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే భర్తీ ప్రక్రియలో అనుసరించాల్సిన నిబంధనల్లో ముఖ్యంగా జోనల్ వ్యవస్థపై స్పష్టత లేకపోవడం వల్ల నియామకాలపై ముందుకు పోలేకపోతున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకొని బోధనాసుపత్రుల వరకూ అన్ని స్థాయుల ఆసుపత్రుల్లోనూ వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఫలితంగా రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. దీన్ని చక్కబెట్టడానికి ప్రభుత్వం 2,118 పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. ఇందులో 30 శాతం వైద్యుల పోస్టులుండగా, సుమారు 50 శాతం వరకూ నర్సులు, ఏఎన్ఎంల పోస్టులున్నాయి. వైద్యులు సహా అన్ని పోస్టులనూ రాత పరీక్ష విధానంలోనే భర్తీ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. అయితే రాత పరీక్ష ద్వారా వైద్యుల భర్తీని కొందరు ప్రభుత్వ వైద్యులు వ్యతిరేకించారు. ప్రభుత్వ వైద్యంలో దీర్ఘకాలంగా గ్రామీణం, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులు రాతపరీక్షలో తాజాగా ఉత్తీర్ణులైన వైద్యులతో పోటీపడలేరనీ, దీనివల్ల గ్రామీణంలో పనిచేసిన వైద్యులకు అన్యాయం జరుగుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వైద్యుల ఖాళీలను నేరుగా గ్రామీణంలో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న వైద్యులతో భర్తీ చేయాలని కోరారు. అయితే ఈ విషయంలో తర్జనభర్జన పడిన ప్రభుత్వం చివరికి రాతపరీక్ష ద్వారానే వైద్యుల పోస్టులను భర్తీ చేయాలనే నిర్ణయానికొచ్చినట్లు తెలిసింది. ఇదే సమయంలో గ్రామీణంలో పని చేస్తున్న ఒప్పంద వైద్యులకు అన్యాయం జరగకుండా వారికి నియామకాల్లో ప్రత్యేకంగా ‘వెయిటేజీ’ ఇవ్వాలని సర్కారు యోచిస్తోంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను కూడా వైద్యఆరోగ్య శాఖ రూపొందించింది. నియామక దస్త్రాన్ని టీఎస్‌పీఎస్సీకి కూడా పంపించినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి.

## నెలలుగా నాన్చుడే..

ఉమ్మడి రాష్ట్రంలో అమల్లో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నియామకాలు చేపట్టాలా? జోనల్, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో దేన్ని ప్రాతిపదికగా తీసుకోవాలనే స్పష్టత వైద్యఆరోగ్య శాఖ ఇవ్వకపోవడంతో టీఎస్‌పీఎస్సీ కూడా ఈ విషయాన్ని పక్కన పెట్టినట్లు తెలిసింది. ఈ విషయంలో వైద్యఆరోగ్యశాఖలోనూ స్పష్టత లేనట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ ఉమ్మడి రాష్ట్రంలో వైద్యుల పోస్టు రాష్ట్ర స్థాయి పోస్టుగా ఉంది. ఈ పోస్టును జోనల్ లేదా జిల్లా స్థాయి పోస్టుగా మార్చాలనే ఆలోచనలో వైద్యశాఖ ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ఆయా జోన్లలో పని చేయడానికి ఆసక్తి చూపే అభ్యర్థులే ముందుకొస్తారనీ, రాష్ట్రస్థాయి పోస్టు అయితే అధిక శాతం వైద్యులు హైదరాబాద్, పరిసరాలకే పరిమితమవుతున్నారని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అయితే ఇలా పోస్టు స్థాయిని రాష్ట్రం నుంచి జోనల్/జిల్లాకు మార్చడానికి ఉన్న అవకాశాలపై స్పష్టత ఇవ్వాల్సిందిగా సాధారణ పరిపాలన విభాగాన్ని కోరినట్లు వైద్య అధికారులు చెబుతున్నారు. ‘వైద్యుల పోస్టుల భర్తీపై స్పష్టత రాకపోతే కనీసం పారామెడికల్, నర్సుల పోస్టులనైనా భర్తీ చేయొచ్చు కదా’ అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నెలలు గడుస్తున్నా ఈ విషయం తేలకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.